## జపాన్‌ను వణికిస్తున్న ఎస్‌టీఎస్‌ఎస్

టోక్యో, జూన్ 18: కొవిడ్ మహమ్మారి నుంచి బయటపడకముందే మరో మహమ్మారి పుట్టుకొచ్చింది. అది కేవలం 48 గంటల్లో మనిషిని చంపేస్తుందట. ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ తాజాగా జపాన్‌లో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ బ్యాక్టీరియా బారినపడ్డ కేసులు వెయ్యి దాటాయి. ఈ ప్రాణాంతక ఇన్ఫెక్షన్‌ను స్ట్రెప్టోకోకల్ టాక్సిక్ షాక్ సిండ్రోమ్ ( ఎస్‌టీఎస్‌ఎస్) అంటారు. ఈ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తికి ఉదయాన్నే పాదాల వాపు వస్తే, అది మధ్యాహ్ననికి మోకాలి ప్రాంతానికి చేరుకుంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ఈ ఇన్ఫెక్షన్‌ను ఐరోపాలోని మరో ఐదు దేశాలలో కూడా గుర్తించారు. ఈ ఏడాది జపాన్‌లో 2,500 కొత్త కేసులు నమోదు కాగా, వారిలో 30 శాతం మంది మరణించారని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

**లక్షణాలు:** చేతులు, కాళ్లలో నొప్పి, వాపు, జ్వరం, రక్తపోటు మొదలైనవి. ఇన్ఫెక్షన్ పెరిగేకొద్దీ శ్వాసకోశ సమస్యలు వస్తాయి. చివరికి మరణం సంభవిస్తుంది. 50 ఏండ్ల వయసున్న వారు ఎక్కువగా దీని ప్రభావానికి గురవుతున్నారు. ఈ బ్యాక్టీరియా ప్రజల పేగులలో పేరుకుపోతున్నది.

**చికిత్స:** ప్రజలు పరిశుభ్రత పాటించాలి. గాయాలకు వీలైనంత త్వరగా చికిత్స చేయాలి.

## గుజరాత్ జైలు నుంచి పాక్ గ్యాంగ్‌స్టర్‌కు బిష్ణోయ్ వీడియోకాల్!

అహ్మదాబాద్, జూన్ 18: జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షాజద్ భట్టీతో మాట్లాడిన వీడియో ఇప్పుడు వైరల్ కావడంతో దానిపై గుజరాత్ ప్రభుత్వం మంగళవారం విచారణకు ఆదేశించింది. వివిధ కేసులలో లారెన్స్ బిష్ణోయ్ గత ఏడాది ఆగస్టు నుంచి అహ్మదాబాద్‌లోని సబర్మతి సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్నాడు. అయితే ఈద్ సందర్భంగా అతను పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న 19 సెకండ్ల వీడియో బయటకు వచ్చింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ కావడంతో గుజరాత్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జైలు నుంచి కూడా ఇలా స్వేచ్ఛగా పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్లతో మాట్లాడటాన్ని చండీగఢ్ శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్ సింగ్ మజిత తప్పుబట్టారు.కాగా, దేశ సరిహద్దుల్లో డ్రగ్ స్మగ్లింగ్‌తో పాటు పంజాబ్ గాయకుడు మూసేవాలను 2022లో హత్య చేసిన కేసుల్లో లారెన్స్ నిందితుడు. అంతేకాక, నటుడు సల్మాన్ ఖాన్‌పై ఏప్రిల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో కూడా బిష్ణోయ్ గ్యాంగ్ ప్రమేయముందని పోలీసులు తెలిపారు.

## జూలై 29 నుంచి సుప్రీంకోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

న్యూఢిల్లీ, జూన్ 18: చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సుప్రీంకోర్టు వచ్చే నెలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నది. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో పెండింగ్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు ఈ ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దేశంలోని పలు కోర్టుల్లో పేరుకుపోతున్న కేసులను పరిష్కరించడానికి న్యాయస్థానాలు లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా వైవాహిక సంబంధ వివాదాలు, ఆస్తి తగాదాలు, మోటారు వాహనాల ప్రమాద కేసులు, భూ సేకరణ, పరిహారం, బీమా క్లెయిమ్‌లు వంటి కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా ఇరువర్గాల ఆమోదంతో న్యాయస్థానం పరిష్కరిస్తుంది.

## భారత ఆర్మీలో స్కిన్ బ్యాంకు

న్యూఢిల్లీ, జూన్ 18: భారత ఆర్మీ తొలిసారిగా స్కిన్ బ్యాంకును ప్రారంభించింది. ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు తీవ్రమైన కాలిన గాయాలు, చర్మ సంబంధ చికిత్స అందించేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చింది. ఈ స్కిన్ బ్యాంకులో ప్లాస్టిక్ సర్జన్లు, టిష్యూ ఇంజినీర్లు, ప్రత్యేక సాంకేతిక నిపుణులుసహా వైద్య నిపుణులు బృందం ఉంటుందని రక్షణ శాఖ మంగళవారం తెలిపింది. ఢిల్లీలోని ఆర్మీ హాస్పిటల్‌లో ఈ స్కిన్ బ్యాంకును ప్రారంభించినట్టు పేర్కొన్నది.

## రైల్వేలో భద్రతా విభాగ పోస్టులు 1.5 లక్షలు ఖాళీ

న్యూఢిల్లీ, జూన్ 18: రైల్వే శాఖలో భద్రతా విభాగానికి మంజూరైన సుమారు 10 లక్షల ఉద్యోగాలలో 1.5 లక్షలకు పైగా భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# 5 లక్షల మందికి అమెరికా పౌరసత్వం!

- వలసదారులకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారీ ఉపశమనం
- వేలాదిమంది భారతీయులకు లబ్ధి



వాషింగ్టన్, జూన్ 18: అమెరికాలో చట్టబద్ధమైన హోదా లేని లక్షలాది మంది వలసదారులకు ఉపశమనం కల్పిస్తూ ఆ దేశ అధ్యక్షుడు బైడెన్ కీలక ప్రకటన చేశారు. అమెరికా పౌరుల విదేశీ జీవిత భాగస్వాములు, వారి పిల్లలకు దేశ పౌరసత్వం కల్పించనున్నట్టు వెల్లడించారు. దాదాపు 5 లక్షల మందికి ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం చేకూరనున్నట్టు అంచనా. వేలాది మంది భారతీయులకు కూడా ఇది లబ్ధి చేకూర్చనున్నది. విదేశీ జీవిత భాగస్వాములు కలిగిన అమెరికా పౌరులు, వారి పిల్లలు కలిసి ఉండేలా చర్యలు తీసుకోవాని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి బైడెన్ ఆదేశాలు జారీ చేశారు. లీగల్ స్టేటస్ లేకుండా ఉంటున్న అమెరికా పౌరుల జీవిత భాగస్వామ్యులకు శాశ్వత నివాసానికి, పౌరసత్వానికి దరఖాస్తు చేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించనున్నదని వైట్‌హౌస్ ప్రకటించింది. బైడెన్ కొత్త ప్రణాళిక ప్రకారం వేలాది మంది భారత సంతతి అమెరికన్లతో సహా దాదాపు 5 లక్షల మంది వలసదారులు అమెరికా పౌరసత్వం పొందుతారని వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దరఖాస్తు చేసేందుకు అర్హత పొందాలంటే, ఒక వలసదారు సోమవారం నాటికి అమెరికాలో 10 ఏండ్లు నివాసం ఉండటంతోపాటు అమెరికా పౌరుడిని వివాహం చేసుకొని ఉండాలి. క్వాలిఫై అయిన వలసదారు దరఖాస్తు ఆమోదం తర్వాత.. అతను లేదా ఆమె గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు, తాత్కాలిక వర్క్ పర్మిట్ పొందేందుకు, బహిష్కరణ నుంచి రక్షణ పొందేందుకు మూడేండ్ల సమయం ఉంటుందని అధికారిక వర్గాలు తెలిపాయి.

## థాయ్‌లాండ్‌లో స్వలింగ వివాహాలకు చట్టబద్ధత

బ్యాంకాక్, జూన్ 18: ఆగ్నేయాసియా దేశాల్లో ప్రప్రథమంగా థాయ్‌లాండ్ దేశం సంచలన నిర్ణయం తీసుకుంది. స్వలింగ వివాహాన్ని చట్టబద్ధం చేసే బిల్లును ఆ దేశ మెజారిటీ సెనేట్ సభ్యులు మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఆ దేశంలో ఇప్పటివరకు దీనికి ఉన్న ఆఖరి అవరోధం కూడా తొలగిపోయి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లభించింది. 152 మంది సభ్యులున్న సెనేట్‌లో ఈ బిల్లుకు 130 ఓట్లు అనుకూలంగా పడ్డాయి.

## 41 ఎయిర్‌పోర్టులకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, జూన్ 18: కొద్ది రోజుల క్రితం ఢిల్లీలోని పలు స్కూళ్లకు ఈమెయిల్ ద్వారా వచ్చిన బాంబు బెదిరింపులు తీవ్ర అలజడిని రేపాయి. గుర్తుతెలియని దుండగులు మరోసారి అదే పనిచేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సహా దేశంలోని 41 విమానాశ్రయాలకు మంగళవారం ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది విమానాశ్రయాల్లో కొన్ని గంటలపాటు తనిఖీలు చేపట్టగా, అవి నకిలీ బాంబు బెదిరింపులుగా అధికారులు తేల్చారు.




## కార్యకర్తతో కాళ్లు కడిగించుకొన్న మహా కాంగ్రెస్ నేత!

*కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే మంగళవారం అకోలా జిల్లా పర్యటనలో పార్టీ కార్యకర్తతో తన బురద కాళ్లను కడిగించుకోవడం విమర్శలకు దారితీసింది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ భూస్వాముల మనస్తత్వాన్ని తెలియజేస్తున్నదని బీజేపీ నేత షెహ్‌జాద్ విమర్శించారు. 'వాళ్లు కార్యకర్తలను సేవకులుగా భావిస్తారు. అధికారంలో లేనప్పుడు వాళ్లు ప్రజలతో ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించండి. పొరబాటున అధికారంలోకి వస్తే వాళ్లేం చేస్తారో ఊహించుకోండి' అని అన్నారు.*

## క్యాన్సర్‌తో భార్య మృతి.. ఐపీఎస్ అధికారి ఆత్మహత్య

దిస్‌పూర్, జూన్ 18: భార్య మరణాన్ని తట్టుకోలేక 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శిలాదిత్య చెటియా మంగళవారం ఆత్మహత్య చేసుకొన్నారు. ఆయన ప్రస్తుతం అస్సాం హోం శాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన భార్య దవాఖానలో చికిత్స పొందుతూ మరణించింది. ఆ వార్త తెలిసిన కొన్ని నిమిషాలకే చెటియా ఆత్మహత్య చేసుకున్నట్టు డీజీపీ జీపీ సింగ్ వెల్లడించారు.




## • పీజీఈసెట్‌లో 91%పాస్




హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలను మంగళవారం కూకట్‌పల్లి జేఎన్టీయూలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి 13 వరకు నిర్వహించిన పరీక్షలకు 22,712 మంది దరఖాస్తు చేసుకోగా, 20,626 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 18,829 (91.28శాతం) మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వీ వెంకటరమణ, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు, పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

## • నేడు పీఈసెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): బీపీఈడీ, యూజీ డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీఈసెట్) ఫలితాలు బుధవారం విడుదలకానున్నాయి. మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, శాతవాహన వర్సిటీ ఇన్‌చార్జి వీసీ సురేంద్రమోహన్ మధ్యాహ్నం 3 గంటలకు ఫలితాలను విడుదల చేస్తారు.

## • నేటి నుంచి దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్

**జూలై 15 నుంచి డిగ్రీ ఫస్టియర్ క్లాసులు**

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. మూడో విడత షెడ్యూల్‌ను విద్యాశాఖ అధికారులు సవరించి నూతన షెడ్యూల్‌ను రూపొందించారు. రెండోవిడతలో 41,533 మంది విద్యార్థులకు సీట్లను కేటాయించారు. కామర్స్‌లోనే విద్యార్థులు అత్యధికంగా సీట్లను దక్కించుకున్నారు. కామర్స్‌లో 14,012, ఫిజికల్ సైన్సెస్‌లో 9,727, లైఫ్‌సైన్సెస్‌లో 8,791, ఆర్ట్స్ కోర్సుల్లో 4,884 చొప్పున విద్యార్థులు సీట్లను పొందారు. దోస్త్ రెండోవిడత సీట్లను మంగళవారం కేటాయించగా, వివరాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి మీడియాకు వెల్లడించారు. సీట్లు పొందినవారు ఈ నెల 26లోగా ఫీజు చెల్లించి ఆన్‌లైన్ సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని తెలిపారు. డిగ్రీ ఫస్టియర్ సెమిస్టర్ క్లాసులు జూలై 15 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

## • సీబీఆర్‌టీ విధానంలో 'హాస్టల్ వెల్ఫేర్' పరీక్షలు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సంక్షేమ శాఖలకు సంబంధించి ఈ నెల 24 నుంచి ప్రారంభంకానున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, వార్డెన్ పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) విధానంలో నిర్వహిస్తున్నట్టు మంగళవారం టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. సీబీఆర్‌టీ పరీక్షలకు హాజరు కానున్న అభ్యర్థులు పరీక్ష సమయంలో పాటించాల్సిన మార్గదర్శకాలు విడుదల చేశారు. పూర్తి వివరాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

## • కాలేజీల్లో లోపాలుంటే గుర్తింపు రద్దు: బుర్రా

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో లోపాలు ఉంటే కఠినంగా వ్యవహరిస్తామని, ఈ ఏడాది అనుబంధ గుర్తింపును ఇచ్చేదిలేదని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం హెచ్చరించారు. మంగళవారం జేఎన్టీయూలో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. పలు కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, ఫ్యాకల్టీ లేరని, సరైన వసతులు లేవని, ఇలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్య ఎలా అందుతుందని తెలిపారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు హోంగార్డులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా మారితే ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. ఇంజినీరింగ్ ప్రవేశాల నాటికి కాలేజీలకు అనుబంధ గుర్తింపును జారీచేస్తామని, లోపాలున్న కాలేజీలతో రెండుమూడు రోజుల్లో సమావేశం అవుతామని పేర్కొన్నారు. కాలేజీల్లో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా అమలుచేస్తామని చెప్పారు.

## • డీఎస్సీ దరఖాస్తులకు రేపే ఆఖరు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ దరఖాస్తుల గడువు గురువారంతో ముగియనున్నది. రాష్ట్రంలో 11 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకాగా, ఫీజు చెల్లింపు గడువు బుధవారంతో, దరఖాస్తుల గడువు ఈ నెల 20న రాత్రి 11:50కి ముగుస్తుంది. 2,45,135 మంది అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తులు సమర్పించారు.

## • సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్- 2025 లాంగ్ టర్మ్ కోచింగ్ తరగతులు జూలై 18 నుంచి ప్రారంభించనున్నట్టు బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులను ఈ నెల 19 నుంచి జూలై3 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040-24071178 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. గ్రూప్-2 పరీక్షను ఈ నెల 22, 30 తేదీల్లో బీసీ స్టడీ సర్కిళ్లలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

## • ఆర్నెళ్లలో ఒక్క మౌలిక మార్పు కనబడలే

**పోస్టుల భర్తీపై సీఎం సమీక్ష ఏదీ : ఎంపీ కృష్ణయ్య**

ఖైరతాబాద్, జూన్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆర్నెళ్లవుతుందని, కానీ ఒక్క మౌలిక మార్పు కనిపించడం లేదని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన నిరుద్యోగ జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉన్నాయని, వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయ పోస్టులతో పాటు గ్రూప్ 1, 2, 3, 4లో పోస్టులు పెంచాలని, 23 కొత్త జిల్లాలు, 30 డివిజన్లలో పోలీస్‌స్టేషన్లు, గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటివరకు ఏ ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో 5,900 ఎయిడెడ్ పోస్టులు ఉన్నాయని, వాటిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలకు తలొగ్గి అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చి నిరుద్యోగుల పొట్టకొడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులు చదువుతో పాటు ప్రభుత్వ వైఖరిపై పోరాటాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ నెల 20న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే నిరుద్యోగ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో యూత్ ఎంప్లాయిమెంట్ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. వంద రోజుల్లో 20వేల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ నీల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి అన్వర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ రామకోటి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలు నడిరోడ్డుపై యువతి హత్య

- మహారాష్ట్రలోని చిన్చ్‌పాడాలో దారుణం
- అడ్డుకోకుండా వీడియో తీసిన జనం!

ముంబై, జూన్ 18: ప్రేమించిన యువతి.. తనను దూరం పెట్టిందన్న కక్షతో ఓ యువకుడు ఆమెపై అత్యంత పాశవికంగా దాడికి తెగబడ్డాడు. రోడ్డుపై నడుస్తూ వెళ్తున్న యువతిని వెంటాడి దారుణంగా హత్య చేశాడు. పరిశ్రమల్లో వాడే స్పానర్‌తో ఆమె తలపై 18 మార్లు కొట్టడంతో.. యువతి అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. మహారాష్ట్ర కొంకణ్ తీరంలోని వాసా నగరం చిన్చ్‌పాడా ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మృతురాలు ఆర్తి యాదవ్(22), దాడికి తెగబడ్డ రోహిత్ యాదవ్(32) గతంలో ఇద్దరూ ప్రేమించుకున్నారని, కొద్దికాలంగా ఆ యువతి మరొక వ్యక్తికి దగ్గరవ్వటంతో రోహిత్ యాదవ్ ఈ దాడికి తెగబడినట్టుగా స్థానిక పోలీసులు చెబుతున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి.. హత్య కేసు నమోదుచేశామని తెలిపారు. దాడి ఘటనను అడ్డుకోకుండా, కొంతమంది స్మార్ట్‌ఫోన్లలో వీడియో తీయటం.. దానిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయటాన్ని పోలీసులు తప్పుబట్టారు. యువతి తలపై స్పానర్‌తో బాదుతున్నా, రోడ్డుపై అందరూ చూస్తుండిపోవటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది.

